నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | SANGAREDDY

కేసీఆర్ పదేండ్ల పాలన స్వర్ణయుగం

- గడిచిన సంవత్సర కాలంలో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- ఉద్యమ సాధకులు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో గురువు వేలేటి మృత్యుంజయ శర్మ
- మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపిన గురువు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 18: కేసీఆర్ పదేండ్ల పాలన స్వర్ణయుగాన్ని తలపించిందని, అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మలిచారని కేసీఆర్ గురువు వేలేటి మృత్యుంజయ శర్మ అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రాష్ట్ర సాధకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు వేడుకలు సిద్దిపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టకర్త, రాజసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేప్పటిన వృక్షార్చన కార్యక్రమంలో కేసీఆర్ గురువు పాల్గొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మృత్యుంజయ శర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధకులు. రైతు బంధువు, హరిత ప్రేమికులు కేసీఆర్ పుట్టినరోజున మొక్కలను నాటడం సంతోషకరంగా ఉందన్నారు. కేసీఆర్ మానస పుత్రిక హరితహారంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చని తెలంగాణగా మార్చారని కొనియాడారు. ఆయన పదేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గడిచిన ఏడాది పాలనలో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని స్పష్టం చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, తిరిగి ముఖ్యమంత్రి కావాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు. అంతకుముందు హరిత సేన నియోజకవర్గ ఇన్‌చార్జి బాలకృష్ణ వర్మ, బీఆర్ఎస్ సీనియర్ నేత మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నేతలు నాగరాజు, గణేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మొక్కలను నాటుతున్న కేసీఆర్ గురువు వేలేటి మృత్యుంజయ శర్మ

లక్షల ఎకరాలకు రైతుభరోసా దూరం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకుండా లక్షల ఎకరాలను వెబ్‌సైట్‌లో నుంచి మాయంచేసి బ్లాక్‌లో పెట్టిందని, దీంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వ్యవసాయ భూములకు సైతం రైతుభరోసా ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టిందని, వెబ్‌సైట్‌లో లక్షలాది ఎకరాల సాగు భూములు కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8500 సరే నెంబర్లను బ్లాక్‌లో పెట్టి 2 లక్షల మంది రైతులకు రైతుభరోసా ఎగ్గొట్టిందని, రైతులకు పెట్టుబడిసాయం బంద్ చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. పాత వాళ్లకు సగమే రైతుభరోసా ఇస్తూ కొత్త వాళ్లకు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి రైతులకు పూర్తిస్థాయిలో రైతుభరోసా సాయం అందించాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులు వెంటనే దీనిపై రైతులకు సమాధానం చెప్పాలని, బ్లాక్‌లో పెట్టిన సర్వే నెంబర్‌లను తొలిగించి వెంటనే రైతుభరోసా సాయం జమచేసి రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నిమ్జ్ భూబాధితులకు మెరుగైన పరిహారం



హద్నూర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రాజు

- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు

జహీరాబాద్, ఫిబ్రవరి 18: నిమ్జ్ భూబాధితులకు జనరల్ అవార్డు కింద మెరుగైన పరిహారాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రాజు తెలిపారు. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, గుంజోట్టి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిమ్జ్ భూబాధితులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. రెండు, మూడు పంటల పండే సారవంతమైన భూములను తీసుకోవద్దని, వాటిపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నామని రైతులు విజ్ఞప్తి చేశారు. పట్టా, ప్రభుత్వ భూమికి సమానంగా పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ .. మార్చిలో పరిహారాన్ని ఇస్తామని, పట్టా, ప్రభుత్వ భూములకు రూ. 15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామన్నారు. భూబాధితులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మండల డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్ఐ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ధన్‌రాజ్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు షురూ!

- ప్రస్తుతం నిత్యం 34.2 మిలియన్ యూనిట్ల వినియోగం
- ట్రిప్ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- కాలుతున్న బోరుమోటర్లు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- అన్ని ప్రాంతాలకు అందని కాళేశ్వర జలాలు
- నీళ్ల కోసం నిత్యం ఏదోచోట రైతుల ధర్నాలు
- ప్రణాళిక లేని సాగునీటి పారుదలశాఖ
- ఇష్టానుసారంగా నీటి విడుదల
- ఆందోళనలో అన్నదాతలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 17,51,603 విద్యుత్ కనెక్షన్లు.. పెరిగిన విద్యుత్ వినియోగం

గిట్లయితే కష్టమే..

కొమురవెల్లి, ఫిబ్రవరి 18 : ఎండకాలం ఇంకా మొదలేకాలే కరెంట్ గడికోసారి పోతున్నది. పోయినప్పుడల్లా 10 నిమిషాలు పోతున్నది. గిట్లా కరెంట్ పోతే రైతులకు మస్తు ఇబ్బంది అవుతాది. గిప్పుడే గిట్లా ఉంటే వచ్చే నెలలో ఎట్లుంటాదో మరి. గీ ఎండలకు భూమిల నీళ్లు తగ్గుతాయి. గీ సమయంలో కరెంట్ పోయి మళ్ల వొచ్చేసరికి పంట తడి ఆరిపోవడమే గాక చివరిమడి ఎండిపోతాది. ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవసాయానికి నిరంతరాయంగా మంచి కరెంట్ ఇవ్వాలి. గిప్పుడు వచ్చి పోయినట్లు వచ్చిపోతే చేనుల్లో పశువులను వదలడమే అయితాది.

– బుడిగె యాదగిరి, రైతు, గురువన్నపేట (సిద్దిపేట జిల్లా)

సిద్దిపేట, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): యాసంగి సాగుకు విద్యుత్ వినియోగం పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా కావడం లేదు. తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని రైతులు చెబుతున్నారు. ఇప్పుడే కరెంట్ కోతలు మొదలయ్యాయి. మరోవైపు భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. కాళేశ్వర జలాలు అన్ని ప్రాంతాలకు రావడం లేదు. ఫలితంగా యాసంగి పంటలు అప్పుడే ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోఓల్టేజీ సమస్యలతో వ్యవసాయ బావుల మోటర్లు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతుండడంతో మోటర్లు కాలిపోయి బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో రైతులు బోరుబావులు తవ్వించి అప్పుల పాలవుతున్నారు. రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వానకాలం రైతుభరోసా ఇవ్వలేదు. యాసంగికైనా రైతుభరోసా వస్తది అనుకున్న రైతుకు అడియాశనే అయ్యింది. రుణమాఫీ సంపూర్ణంగా కాలేదు, రైతుభరోసా అందడం లేదు, ఫలితంగా అప్పులు తెచ్చి పంటలు సాగుచేసిన రైతులకు పంట చేతికి వచ్చే వరకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు.

ఆదిలోనే కరెంట్ కష్టాలు

ఎండల తీవ్రత పెరగడంతో యాసంగి పంటలు అప్పుడే ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. బోరుబావుల్లో నీటిమట్టం తగ్గింది. కాళేశ్వర జలాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు విద్యుత్ మాటిమాటికి ట్రిప్ అవుతుండడంతో పారిన మడి పారుతున్నది. వరుస తాళ్లతోనైనా వరి చేన్లు బతికి బయటపడేలా లేవు. వరికి రోగాలు వచ్చి మందులు కొట్టి చేన్లు కోలుకుంటాయనే లోపే నీటి కష్టాలు మొదలయ్యాయి. రైతులు బావులు, బోర్లను నమ్ముకుని వరి సాగుచేశారు. ఇప్పుడు కండ్ల ముందే ఎండిపోతున్న పంటలను చూసి కన్నీళ్లు పెడుతున్నారు. కొందరు రైతులు బోర్లు వేసేందుకు సిద్ధ పడుతుండగా, మరికొందరు రైతులు వ్యవసాయ బావుల్లో క్రేన్‌లా ద్వారా పూడికతీత పనులు మొదలు పెట్టారు. ఏడెనిమిది ఏండ్ల తర్వాత పంట చేన్లు ఎండిపోవడం చూస్తున్నామని, మళ్లీ పాత రోజులు యాదికి వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎండకాలం రాకముందే కాళేశ్వర జలాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, హల్దీ, కూడవెల్లి వాగులు నింపడంతో సాగునీటి కష్టాలు రైతులకు ఎదురుకాలేదు. యాసంగిలో గుంట ఎండిపోకుండా రైతుల పంటలు పండించారు. ప్రతి చెరువును కాళేశ్వరం జలంతో ప్రభుత్వం నింపింది. ఫలితంగా బోరుబావుల్లో పుష్కలంల నీరు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారు.

అన్ని ప్రాంతాలకు అందని కాళేశ్వర జలాలు

కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు యాసంగి సాగు ప్రారంభం కాగానే ఏ ప్రాంతానికి ఏ మేర నీటిని విడుదల చేయాలి.. ఎన్ని చెరువులు నింపాలి.. అనే ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లేవారు. ఫలింతగా అన్ని ప్రాంతాలకు కాళేశ్వర జలాలు అందాయి. ఫలితంగా బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో పంటలు ఎండిపోయిన సందర్భాలు లేవు. ప్రధాన రిజర్వాయర్ల నుంచి కాలువల ద్వారా చెరువులు, చెక్‌డ్యామ్‌లకు నీటిని విడుదల చేయడంతో మండుటెండల్లో మత్తళ్లు దుంకాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కాళేశ్వర జలాల విడుదల కోసం రైతులు రాస్తారోకోలు చేస్తున్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

ఉమ్మడి మెదక్ అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు 17,51,603 ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 34.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతున్నది.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు 5,75,928 ఉన్నాయి. వీటిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,73,530, గృహాలు 3,53,346, పరిశ్రమలు 3,850, 45,202 ఇతర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 11.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 3,55,093 ఉన్నాయి. వీటిలో వ్యవసాయ బావుల విద్యుత్ కనెక్షన్లు 1,09,152, గృహ విద్యుత్ కనెక్షన్లు 2,09,174, పరిశ్రమలు 2,411, మిగతా ఇతర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ జిల్లాలో ప్రస్తుతం నిత్యం 8 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 6,14,652, వాణిజ్య 76,938, పరిశ్రమలు 5,504, వ్యవసాయం 1,06,061, ఇతర 17,427 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ జిల్లాలో అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు కలిపి 8,20,582 ఉన్నాయి. ప్రతిరోజు 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతున్నది.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మహేశ్‌దత్ ఎక్కా

సంగారెడ్డిలో మాట్లాడుతున్న మహేశ్ దత్ ఎక్కా

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 18: ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మహేశ్ దత్ ఎక్కా స్పష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు, ఏఆర్వో అధికారులతో ఎన్నికల విధులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రత్యేకత ఉంటుందన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులను గుర్తించి షోకాజ్ నోటీసులు అందజేసి సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మొదటి, రెండో ర్యాండమైజేషన్ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతకుముందు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలోని పోలింగ్ కేంద్రం, అంబేద్కర్ మైదానంలోని డీఆర్సీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ రావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్, నోడల్ అధికారులు, ఆర్వోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శరత్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 18: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మానవ వనరుల విభాగానికి చెందిన డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. దేశంలో ఫార్మారంగం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు కెమిస్ట్రీని ఇష్టంగా చదవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్ కుమార్ రెడ్డి, గోపాల సుదర్శనం, శ్రీధర్, రవికుమార్, శ్రీనివాస్, బాలకిషన్, మనోహర్, భాస్కర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఉధృతమవుతున్న డంపుయార్డు పోరు

- నల్లవల్లి గ్రామస్తుల ఆందోళనలకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- ప్యారానగర్ డంపింగ్‌యార్డు సమీపంలో కొత్తపల్లి, నల్లవల్లి గ్రామస్తుల ఆందోళన
- డంపింగ్‌యార్డు వైపు వెళ్తున్న గ్రామస్తులను అడ్డుకున్న పోలీసులు
- హైవేపై ర్యాలీ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- గుమ్మడిదలలో దీక్షలో కూర్చున్న బ్రాహ్మణసంఘం సభ్యులు
- గుమ్మడిదల, నల్లవల్లి హైవేపై బతుకమ్మ ఆటపాటలతో నిరసన

ఉద్రిక్తంగా మారిన నల్లవల్లి హైవే.. అట్టుడికిన ప్యారానగర్, నల్లవల్లి



గుమ్మడిదల మున్సిపాలిటీలో రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

గుమ్మడిదల, ఫిబ్రవరి 18: ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనలు మంగళవారం మరింతగా ఉద్రిక్తంగా కొనసాగాయి. మంగళవారం నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామస్తులు, రైతు జేఏసీ నాయకులు ట్రాక్టర్లపై ర్యాలీగా డంపింగ్‌యార్డు నిర్మాణం చోటుకు బయలుదేరారు. వారిని మార్గమధ్యలో పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు బలవంతంగా వెనక్కి పంపడంతో బాధిత గ్రామాల ప్రజలు హైవేపై నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుపై రేవంత్ సర్కారు మొండిగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహిస్తూ మంగళవారం గుమ్మడిదలలో జాతీయ రహదారి–765డీ పై బతుకమ్మ ఆటపాటలతో నిరసన తెలిపారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదలలో మంగళవారం 8వ రోజు రిలే నిరాహార దీక్షలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్రాహ్మణ సంఘం నాయకులు శంకర్‌శర్మ, కిరణ్‌కుమార్‌శర్మ, రవీందరరావు కులకర్ణి, కేవీ. నర్సింహాచార్యులు, విజయ్‌రామన్‌చార్యులు, రాముశర్మ, రాఘవేందర్ రావు, అనంత్‌కుమార్‌శర్మ, ప్రసాద్, చైతన్య శర్మ, మహిళు మాధవి కులకర్ణి, లక్ష్మీసంతోషి, నర్మద. అన్నపూర్ణ, రంగనాయకి తదితరులు పాల్గొన్నారు. వారికి సీపీఏం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జయరాజు, రాజయ్య, కేవీపీఎస్ కార్యదర్శివర్గ సభ్యులు అతిలేలి మాణిక్య, నాగేశ్వర్‌రావు సంఘీభావం తెలిపారు.

కుంపటి పెడతారా: చుక్క రాములు

చుక్కరాములు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి ప్రజల పచ్చని బతుకుల్లో కుంపటి పెడతారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రజాభిప్రాయం లేకుండా కస్టోడియల్ భూముల్లో డంపింగ్ యార్డు నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డు పనులు వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఇది ఒక గుమ్మడిదల మండల ప్రజల సమస్య కాదని, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల సమస్య అని అన్నారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో నర్సాపూర్ రాయ చెరువు, గొలుసుకట్టుగా ఉన్న చెరువులకు, కుంటలకు కాలుష్య ముప్పు పొంచి ఉందన్నారు. వ్యవసాయం కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాంటూ ఈనెల 20న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దీక్ష చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, రైతు మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, మద్లు బాల్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లవల్లి హైవేపై ఆందోళన చేస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు

కాంగ్రెస్‌ది రాక్షస పాలన

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు, ఇప్పుడు రాక్షస పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. ఇంత దుర్మార్గమైన పాలకులను ఎప్పుడూ చూడలేదన్నారు. రెండు వారాలుగా ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేస్తుంటే అధికార యంత్రాంగం, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమని శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్న సోయి కాంగ్రెస్ సర్కారుకు లేదా అన్ని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలోనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని కోర్టు నిబంధనలు బేఖాతరు చేస్తూ గ్రామీణ ప్రాంతమైన కస్టోడియన్ భూముల్లో ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. వెంటనే డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని రేవంత్ సర్కారుకు ఆయన హెచ్చరించారు. ఆందోళనలో రైతు జేఏసీ నాయకులు ఆంజనేయులు, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, ఫయాజ్ షరీఫ్, మాజీ సర్పంచ్‌లు శంకర్, శ్రీనివాస్, శంకర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీకి పీసీబీ నోటీసు

ముత్తంగిలో చెత్త కాల్చడంపై ప్రజల ఫిర్యాదులు

వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'

పటాన్‌చెరు, ఫిబ్రవరి 18: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో భారీగా చెత్తను తగులబెడుతుండడంపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన పీసీబీ మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మంగళవారం సంగారెడ్డి పీసీబీ ఈఈ గీత తెల్లాపూర్ మున్సిపాలిటీకి అందజేసిన నోటీసు వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామాన్ని తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఐదు నెలల క్రితం విలీనం చేశారు. గ్రామ పరిధిలో పోగవుతున్న చెత్తను పాశమైలారం, కర్ధనూర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గుంతలో వేసి భారీగా పోగైన తర్వాత మంట పెట్టి తగులపెడుతున్నారు. చెత్త కాల్చడంపై పీసీబీ జనవాని – కాలుష్య నివారిణి పోర్టల్‌కు పలువురు ఫిర్యాదులు చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలోనూ ప్రచురితమైన కథనాలపై స్పందించిన పీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ తెల్లాపూర్ మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేశారు. తడి, పొడి చెత్తను విడదీయకుండా తగులబెట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. చెత్తను తగలబెట్టవద్దని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జారీచేసిన ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్ 2016 ప్రకారం, ఆర్డర్ 1357(ఈ), 08–04–2016 రూల్స్‌ను పాటించనందుకు, తెలంగాణ సర్కార్ ఇచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 27, 2017ను అతిక్రమించినట్టుగా పేర్కొంటూ నోటీసు జారీ చేశారు. చెత్తను, ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో తగులబెట్టడంపై నోటీసులో ప్రశ్నించారు. 'మీ మున్సిపాలిటీపై జరిమానా ఎందుకు విధించరాదు' అని నోటీసులో పేర్కొన్నారు. ఈనెల 1 నుంచి 13వ వరకు ముత్తంగి చెత్త డంపింగ్ చేస్తున్న బహిరంగ స్థలాన్ని తనిఖీ చేశామని, అక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా నిత్యం చెత్తను తగలబెట్టడం కనిపించిందని నోటీసులో పీసీబీ అధికారులు పేర్కొన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 ప్రకారం మున్సిపాలిటీ నిబంధనలను పాటించడం లేదని గ్రహించామని, నోటీసు అందిన ఏడు రోజుల్లో జవాబు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.





తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో చెత్తను తగులబెట్టిన దృశ్యం (ఫైల్)